# మెజార్టీపై ధీమా..



మరికల్‌లో ఓటు వేసేందుకు బారులుదీరిన ఓటర్లు

- పేట నియోజకవర్గ పరిధిలో 78.46, మక్తల్ నియోజకవర్గ పరిధిలో 83.34 శాతం

మరికల్, డిసెంబర్ 1 : మండలంలో బీఆర్ఎస్ పార్టీ మెజార్టీ ఓట్లు సాధిస్తుం దని పార్టీ శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. మరికల్ మండలంలోని 12 గ్రామాలు నారాయణ పేట నియోజకవర్గం, 5 గ్రామాలు మక్తల్ నియోజకవర్గంలో కొనసాగుతున్నాయి. నారాయణపేట్ నియోజకవర్గంలోని 27 పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 23,705 మంది ఓటర్లు ఉండగా అందులో పురుషులు 11,690, మహిళలు 12015 మంది ఉన్నారు. ఎలిగండ్ల గ్రామంలో 1,458 మంది ఓటర్లకు గానూ మొత్తం ఓట్లు పోలయ్యాయి. పస్పులలో 752 మందికి గానూ 625 మంది ఓటు హక్కు వినియోగించుకోగా , మరికల్‌లో 8,269 మందికి గానూ 5,692, ఇబ్రాహీంపట్నంలో 460 మందికి గానూ 404, పలెగడ్డలో 723 మందికి గానూ 646 , అప్పంపల్లిలో 1,377 మందికి గానూ 1,168 మంది, పెద్దచింతకుంటలో 2,336 మందికి గానూ 1,707, వెంకటపూర్‌లో 719 గానూ 595 మంది, మాధ్వర్‌లో 2,281 గానూ 2,039 మంది, తీలేరులో 2,444 గాను 2,072, రాకొండలో 1,382 గానూ 1,170, పుసల్‌పాడ్‌లో 1,504 గానూ 1,304 మంది ఓటు హక్కు వినియోగించుకోగా 78.46 శాతం పోలింగ్ నమోదయ్యింది. మరికల్ మండలంలో బీఆర్ఎస్‌కు ఓటింగ్ పెరిగిందని, కాంగ్రెస్, బీజేపీలకు వెయ్యి లోపే ఓట్లు పడ్డట్లు బీఆర్ఎస్ నాయకులు అంచనా వేస్తున్నారు.

మక్తల్ నియోజకవర్గంలోని 9 పోలింగ్ కేంద్రాల్లో 8,382 మంది ఓటర్లు ఉన్నారు. అందులో పురుషులు 4,138, మహిళలు 4,244 మంది ఉన్నారు. చిత్తనూర్‌లో 1,994 మందికి గాను 1,662 మంది ఓటుహక్కు వినియో గించుక్నురు. జిన్నారంలో 2,003 మందికి గానూ 1,639, ఎక్లాస్‌పూర్‌లో 914 గాను 785, కన్మనూర్‌లో 2,732 గానూ 2193 , గాజులయ్య తండాలో 739 మంది కి గానూ 640 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. మక్తల్ నియోజ కవర్గానికి సంబంధించి 83.34 శాతం నమోదయ్యింది. నారాయణ పేట నియోజకవర్గంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య పోటీ నెలకొనగా బీజేపీ నామమత్రంగా ఉంది. మక్తల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ మధ్య త్రిముఖ పోటీ నెలకొనగా రెండు నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులే విజయం సాధిస్తారని పార్టీ శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

## ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కోయ శ్రీహర్ష

నారాయణపేట, డిసెంబర్ 1: జిల్లాలో అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా స్వేచ్ఛగా జరిగాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కోయ శ్రీహర్ష శుక్రవారం ప్రకటనలో తెలిపారు. గురువారం నారాయణపేట, మక్తల్ నియోజకవర్గంలో ఉదయం నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద పెద్ద ఎత్తున బారులు దీరి ఉత్సాహంతో ఓటింగ్‌లో పాల్గొన్నారని పేర్కొన్నారు. నారాయణపేట నియోజకవర్గ పరిధిలో 78.36 శాతం, మక్తల్ నియోజక వర్గంలో 77.13 శాతం ఓట్లు వేశారని ఆయన పేర్కొన్నారు. 554 పోలింగ్ కేంద్రాల్లో జిల్లా యంత్రాంగం, పోలీసుల సహకారంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తావులేకుండా పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగిందని అన్నారు. ఓటర్లను చైతన్యవంతం చేసే కార్యక్రమంలో భాగంగా ప్రజల్లో ఓట్ల ఆవశ్యకతను వివరించడం జరిగిందని అన్నారు. యువతకు సంబంధించిన మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఇక పోలింగ్ ప్రక్రియను క్షణం క్షణం పర్యవేక్షించేందుకు కలెక్టర్ కార్యాల సమావేశం మందిరంలో నియోజకవర్గం వారీగా వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేసి నట్లు తెలిపారు. ఏ చిన్న లోటు పాట్లు ఉన్నా వెంటనే స్పందించి అప్పటికప్పుడే సమస్యను పరిష్కరించి పోలింగ్ నిర్వహించినట్లు తెలిపారు. మైక్రోఅబ్జర్వర్‌ను ఏర్పాటు చేసి ఎన్నికల ప్రక్రియ ఆటంకాలు లేకుండా విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈవీఎంలను గట్టి భద్రత మధ్య దత్త కళాశాలకు తరలించి ఎన్నికల పరిశీలకుడు బీపీ చౌహాన్ అధ్వర్యంలో రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌లో సీజ్ చేశామన్నారు.

## 4న వైద్య శిబిరం

నారాయణపేట రూరల్, డిసెంబర్1 : జిల్లా కేంద్రంలోని భవిత కేంద్రంలో ఈ నెల 4న బసవతారకం ఇండో ఆమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్, సమగ్రశిక్ష వైద్యులు ముకుంద్‌రెడ్డి, బసవతారకం స్మైల్‌సెంటర్ ఆధ్వర్యంలో గ్రహణం మొర్రి వైద్య శిబిరం నిర్వహిచనున్నట్లు డీఈవో అబ్దుల్ గని శుక్రవారం ప్రకటనలో తెలిపారు.

ఎమ్మార్సీ భవనంలో గల భవిత కేంద్రంలో ఉదయం 10 గంటలకు నిర్వహించినున్న ఈ శిబిరాన్ని గ్రహణం మొర్రిఉన్న 6 నెలల వయస్సు నుంచి 50 సంవత్సరాల వారు సద్వి నియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

## నేటి నుంచి నర్సింహస్వామి ఆరాధనోత్సవాలు



ఉత్సవాలకు ముస్తాబైన నర్సింహస్వామి ఆలయం



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

నారాయణపేట, డిసెంబర్ 1: పేట పట్టణంలోని సుభాష్‌రోడ్‌లో కొలువుదీరిన సద్గురు అవదూత నర్సింహస్వామి 132వ సంజీవని సమాధి ఆరాధన ఉత్సవాలు శనివారం నుంచి వైభవంగా నిర్వహించనున్నట్లు మఠం కమిటీ సభ్యులు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఆరాధనోత్సవాల సందర్భంగా స్వామి వారికి కాకడ హారతి, రుద్రాభిషేకం, పాదుకపూజ, అఖండదీప ప్రజ్వలన, మహా అలంకరణ, మధ్యాహ్నం పల్లకీ సేవ అనంతరం ప్రసాదవితరణ,అన్నదానం నిర్వహించనున్నట్లు తెలిపారు. రాత్రి 8 గంటలకు కార్తీకదీపారాధన ఉంటుందని భక్తులు,శిష్యులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలన్నారు.



ఊట్కూర్ మండలంలో సమయం దాటినా ఓటేసేందుకు వచ్చిన ఓటర్లు

## కారు వైపే మొగ్గు..

ఊట్కూర్, డిసెంబర్ 1 : మండలంలో గురువారం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మండల వ్యాప్తంగా ఓటర్లు కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్ వైపు మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. మండలంలో మొత్తం 51 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా 44,272 మంది ఓటర్లకు గాను 30,389 మంది ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. ఈమేరకు మండలంలో 72 శాతం పోలింగ్ నమోదైంది. గత 2018 అసెంబ్లీ ఎన్నికల్లో మక్తల్ నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో నిలిచి గెలిచిన ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి భారీ ఆదిక్యతను సాధించారు. ఈసారి కూడా చిట్టెం గెలుపు ఖాయమనే భావనను ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. ప్రజా సంక్షేమం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆసరా పింఛన్లు, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, ఎకరాకు రూ. 10 వేలు అందించే రైతు బంధు, రైతు బీమా పథకం, వ్యవసాయానికి 24 గంటల కరెంటు సరఫరా వంటి పథకాలకు ఆకర్షితులైన ప్రజలు బీఆర్ఎస్‌కు భారీ ఆదిక్యతను కట్టబెట్టినట్లు చర్చించుకుంటున్నారు. గ్రామాల వారీగా పోలైన ఓట్లలో యాభై శాతం బీఆర్ఎస్ పార్టీకి ఓటేశామని ఓటర్లు బాహాటంగా పేర్కొంటున్నారు.

### భారీ మెజారిటీతో గెలుపు ఖాయం

గురువారం జరిగిన ఎన్నికల్లో మక్తల్ నియోజక వర్గం నుంచి తమ పార్టీ అభ్యర్థి చిట్టెం రామ్మోహన్‌రెడ్డి భారీ మెజారిటీతో గెలుపొందటం ఖాయమని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, సర్పంచ్ సూర్యప్రకాశ్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ అరవింద్‌కుమార్, రైతు బంధు సమితి మండలాధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ మండలంలో ప్రతి గ్రామం నుంచి మెజారిటీ వస్తుందన్నారు. తమ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ప్రజలు ఆకర్షితులై మరోమారు బీఆర్ఎస్‌కు పట్టం కట్టబోతున్నారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని తెచ్చుకోవాలన్న ఆకాంక్షతో ప్రస్తుత ఎన్నికల్లో ప్రజలు తమకు అనుకూలంగా ఓటు వేశారని తెలిపారు. ఈ సందర్భంగా వారు ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఎస్.ఆర్.రెడ్డి హ్యాట్రిక్ విజయం ఖాయం

దామరగిద్ద, డిసెంబర్ 1: పేట నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఎస్. రాజేందర్‌రెడ్డి హ్యాట్రిక్ విజయం సాధిస్తారని ఎంపీపీ బక్క నర్సప్ప, రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ భీమయ్యగౌడ్ శుక్రవారం ప్రకటనలో ధీమా వ్యక్తం చేశారు. మండంలోని అన్ని గ్రామాల్లో బీఆర్ఎస్‌కు ఓట్ల శాతం పెంచడానికి బీఆర్ఎస్ కార్యకర్తలు రెండు నెలల పాటు అహర్నిశలు కష్టపడ్డారన్నారు. ఎమ్మెల్యే ఎస్.ఆర్.రెడ్డి గెలుపు కోసం నిరంతరం పని చేసిని కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని పేర్కొన్నారు.

## మహిళా ఓటర్లే అధికం..

నారాయణపేట, డిసెంబర్ 1: నారాయణపేట నియోజకవర్గంలో గురువారం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పురుషులకంటే మహిళలే అధికంగా ఓటుహక్కు వినియోగించుకున్నారు. మొత్తం 1,81,708 మంది ఓటర్లు ఓటు హక్కును విని యోగించుకోగా అందులో 91,114 మంది మహిళలు ఉండగా పురుషులు 90 , 593మంది పురుష ఓటర్లు ఉన్నారు. పురుషుల కంటే 521 మంది మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇక నియోజకవర్గం వ్యాప్తంగా ఇద్దరు ట్రాన్స్‌జెండర్ ఓటర్లు ఉండగా వీరిలో ఒకరు ఓటు హక్కును వినియో గించుకున్నారు. నియోజకవర్గం మొత్తంలో అత్యల్పంగా 74.91శాతం ఓటింగ్ నారాయణపేట పట్టణంలో నమోదయ్యింది.